క్లుప్తంగా

రికార్డు స్థాయిలో పన్నుల వసూలు

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థలో ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీ నాటికి 85శాతం పన్నులు వసూలు చేసినట్లు నగర కమిషనర్ యు శారదాదేవి చెప్పారు. నగరంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మంగళగిరి–తాడేపల్లి పట్టణాలతో పాటు 21 గ్రామాల విలీనంతో ఏర్పడిన నగరపాలక సంస్థ తొలి ఏడాదిలోనే 85 శాతం పన్నులు వసూలు చేయడం శుభపరిణామమన్నారు. ఆస్తి, తాగునీరు, ఖాళీ స్థలాల పన్నులను సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరిస్తున్న నగర వాసులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పన్నుల వసూలులో నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారులు, సిబ్బంది తోపాటు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది నిరంతరం కృషిచేసి చేశారని, వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. పన్ను బకాయిలపై ఇచ్చిన వడ్డీ రాయితీలను సద్వినియోగం చేసుకుని నగర అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఏప్రిల్ నెలలో 5 శాతం రాయితీతో ఇంటి పన్నులు ముందస్తుగా చెల్లించుకోవచ్చని తెలిపారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరంలో వేంచేసి ఉన్న శ్రీమద్వీంరాంజనేయ సమేత కోదండరామస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు అందజేశారు. వసంతోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అగ్నిహోత్రం సత్యకుమార్, శంకరమంచి సుప్రకాష్, కృష్ణప్రసాద్, భాగ్యజ్యోతి, లక్ష్మణ్, శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మనవైపు చూసేలా విద్యార్థుల ఆవిష్కరణలు ఉండాలి

జూపిటర్ ఆర్గానిక్స్ ఫార్మర్ సీఈవో ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ

మోతడక(తాడికొండ): అభివృద్ధి చెందిన దేశాలు మన దేశం వైపు చూసేలా విద్యార్థుల ఆవిష్కరణలు ఉండాలని జూపిటర్ ఆర్గానిక్స్ ఫార్మర్ సీఈఓ ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ అన్నారు. తాడికొండ మండలం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న నేషనల్ లెవల్ టెక్‌ఫెస్ట్ ఉద్ఘోష్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో చాలా దేశాలు మనదేశం సహాయం కోసం ఎదురు చూశాయన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ వై సుజిత్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ వి రంగారావు మాట్లాడారు. 52 కళాశాలలకు చెందిన 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సాంకేతిక ఆవిష్కరణలు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె నాగశ్రీనివాసరావు, ఫెస్ట్ కన్వీనర్ డాక్టర్ వి నాగ గోపిరాజు, ఫిజికల్ డైరెక్టర్ డి.రాము, బి తులసీరాణి, డాక్టర్ పి బాలమురళీ పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవలను పాడి రైతులు ఉపయోగించుకోవాలి

ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య నిర్వహణాధికారి ఎం శ్రీనివాసరావు

కంతేరు(తాడికొండ): పశు సంవర్థక శాఖ అందించే సేవలను పాడిరైతులు ఉపయోగించుకొని పాడి పోషణ పెంచుకోవాలని ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య నిర్వాణాధికారి ఎం శ్రీనివాసరావు అన్నారు. శనివారం తాడికొండ మండలం కంతేరులో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన–గాలికుంటు టీకాలు, ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రభుత్వం పాడిరైతులకు అన్ని రకాల తోడ్పాటు అందిస్తూ రాయితీలు కల్పిస్తుందని, రైతులు వాటిని ఉపయోగించుకొని పాడి పరిశ్రమను పెంచుకోవాలని సూచించారు. ఎంపీటీసీ వలపర్ల కల్పన మాట్లాడారు. పోటీలో పాల్గొన్న 42 దూడలకు నట్టల నివారణ మందును అందజేయడంతోపాటు 125 పశువులకు గాలికుంటు టీకాలు, 48 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాడికొండ ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ .శివ సారథిబాబు, పశు వైద్యాధికారులు డాక్టర్ రవితేజ, డాక్టర్ మల్లయ్య, డాక్టర్ సౌజన్య పాల్గొన్నారు.

20 ఏళ్ల సమస్య..24 గంటల్లో పరిష్కారం

- చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేసిన ఎమ్మెల్యే ఆర్కే
- ధన్యవాదాలు తెలియజేసిన మహిళలు, చిరువ్యాపారులు



24గంటలలో వేసిన పబ్లిక్ ట్యాప్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

మంగళగిరి: 20 ఏళ్ల సమస్య 24 గంటలలో పరిష్కారం కావడంతో స్థానిక మహిళల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. నగరంలో ఆత్మకూరు గుంటూరు చానల్ వద్ద రోడ్డు వెంట సుమారు 25 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారికి తాగునీటి వసతి లేకపోవడంతో రోడ్డుకు అవతల వైపు ఉన్న తాగునీటి పథకం వద్ద నీరు పట్టుకుంటున్నారు. ట్రాఫిక్ సమయాలలో రోడ్డు దాటి నీరు తెచ్చుకోవాలంటే ఇబ్బంది పడడమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తాగునీటి పథకం ఆవరణలో జరుగుతున్న స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింగ్ పనులు పరిశీలించేందుకు వెళ్లారు. ఎమ్మెల్యేని మహిళలు కలసి ఇబ్బందులు వివరించారు. వెంటనే ఎమ్మెల్యే ఆర్కే వారి ఇళ్ల వద్ద పబ్లిక్ ట్యాప్ వేయాలని నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. శుక్రవారం ఉదయం పబ్లిక్ ట్యాప్ పనులు ప్రారంభించిన అధికారులు సాయంత్రానికి పూర్తిచేసి నీటిని అందించారు. తాము 20 ఏళ్లుగా పడుతున్న బాధను గమనించిన ఎమ్మెల్యే ఆర్కే 24 గంటలలో పరిష్కరించడం అభినందనీయమని కొనియాడారు. స్థానిక మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత..

నగరంలో చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పలువురికి ఎమ్మెల్యే ఆర్కే అండగా నిలిచారు. ఎమ్మెల్యే ఆర్కే అందజేసిన నాలుగు తోపుడు బండ్లను నలుగురు చిరువ్యాపారులకు నగరంలోని ఆటోనగర్‌లోకల ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు పంపిణీ చేశారు. కృష్ణాయపాలెంకు చెందిన ప్రాతూరు నాగేశ్వరరావు, రత్నాలచెరువుకు చెందిన మల్లీశ్వరి, కొత్తపేటకు చెందిన జేమ్స్, పాతమంగళగిరి రజకవీధికి చెందిన నేరెళ్ల సాంబశివరావులు చిరువ్యాపారాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. తోపుడు బండ్లు ఇప్పించాలని ఎమ్మెల్యే ఆర్కేని కోరగా శనివారం ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, జిల్లా కార్యదర్శి మల్లవరపు సుధారాణి, పార్టీ నాయకులు సంకా బాలాజీ గుప్తా, ఆకురాతి రాజేష్, ఎండి ఫిరోజ్, అంజి పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: తాడేపల్లి ప్రాంతంలోని చిరువ్యాపారులకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం తోపుడు బండ్లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు మాట్లాడారు. నులకపేటకు చెందిన ఆటో డ్రైవర్ ఎస్‌కె సుభానికి ఇటీవల పక్షవాతం రాగా అతను నడవలేని పరిస్థితిలో ఉండడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే సుభానికి ట్రై సైకిల్ అందజేసినట్లు తెలిపారు. మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ రసూల్, బీసీ సెల్ నాయకులు కుంచాల శ్రీను, కాపుసంఘం నాయకులు భూపతి కిషోర్, నులకపేటకు చెందిన షేక్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై వార్షిక వేడుకలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపాఠశాల విద్యార్థి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై అష్టలక్ష్ములను ప్రతిష్టించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళా శాసనములతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు తిరుమంజనసేవ, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. 10 గంటల నుంచి సహస్ర నామార్చన, కుంకుమార్చన, ప్రసాద నివేద కార్యక్రమాలు నిర్వహించి అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారి తిరువీధి సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించారని జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో వేదపాఠశాల విద్యార్థులు, విజయకీలాద్రి అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన ఫిల్మ్ ఫెస్టివల్



కేఎల్‌యూ విద్యార్థులు రూపొందించిన మాహిష్మతి సామ్రాజ్య నమూనా

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఫిల్మ్ ఫెస్టివల్ వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి సీఈఓ దేవి ప్రసాద్ బలివాడ ముఖ్య అతిథిగా విచ్చేశారు. లలిత కళల విభాగ అధిపతి సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిల్మ్ ఫెస్టివల్ ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. విజువల్ కమ్యూనికేషన్ విద్యార్థులు తీసిన ఫొటోలతో కూడిన ఫొటో బుక్‌ను ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు ఆవిష్కరించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన వారికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్



పథకాల వివరాలు తెలియజేస్తున్న నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

ఫిరంగిపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో రెండో రోజైన శనివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా మరో 30 ఏళ్లపాటు జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. జగన్ వల్లనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. ప్రతి వ్యక్తి ఆయన పట్ల విశ్వాసంతో ఉన్నారని దానికి కారణం ప్రతి గ్రామంలో ముఖ్యమంత్రిగా జగన్ వచ్చిన తరవాత జరిగిన అభివృద్ధే అందుకు నిదర్శనమని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి గెలుపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పి.మధుసూదనరావు, మరియబాబు, టి.లక్ష్మయ్య, బి.శ్రీనివాసరెడ్డి, ఎం.సుధాకరరెడ్డి, జోజిబాబు, పి.విజయలక్ష్మి, సీహెచ్ చంద్రం, టి.కృష్ణ, కె.థామస్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, జి.కోటేశ్వరరావు, నాగరాజు, మండల నాయకులు, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

టిడ్కో నివాసాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా



నగర పాలక సంస్థ పంపిన ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

మంగళగిరి: స్థానిక వైఎస్సార్ జగనన్న కాలనీ(టిడ్కో) నివాసాలకు నగర పాలక సంస్థ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు. టీడీపీ కార్యకర్తల అత్యుత్సాహం ప్రదర్శించడంపై స్థానికులు మండిపడ్డారు. కాలనీలోని గృహాలకు ఏపీఐఐసీలోని తాగునీటి పథకం నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. శనివారం పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. వెంటనే స్పందించిన నగర పాలక సంస్థ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేశారు. నగర పాలక సంస్థ నీరు సరఫరా చేయడంతో స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదు. మధ్యాహ్నం మూడు గంటలకు పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి చేయడం జరిగిందని టిడ్కో నివాసాలకు నీటి సమస్య పరిష్కారమైందని నగర పాలక సంస్థ అధికారులు తెలిపారు.

టీడీపీ కార్యకర్తల అత్యుత్సాహం

టీడీపీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. టీడీపీ నాయకుడు లోకేష్ పంపించాడంటూ ట్యాంకర్ తీసుకువచ్చారు. తమ ట్యాంకర్ వద్దనే నీరు పట్టుకోవాలని స్థానికులపై ఒత్తిడి తెచ్చారు. టీడీపీ కార్యకర్తల తీరుపై స్థానికులు మండిపడ్డారు. పైప్‌లైన్ మరమ్మతులకు గురైన వెంటనే ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారని, అధికారులు ట్యాంకర్లు ఏర్పాటు చేయడంతో నీటిని పట్టుకున్నామని తెలిపారు. ఇక్కడ రాజకీయాలు ఎందుకు మాట్లాడుతున్నారని టీడీపీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ



ఇంట్లో బీరువా పగలగొట్టి చిందర వందర వేసిన వస్త్రాలు

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో చోరీ ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు విశ్రాంత ఉపాధ్యాయుడు బి నరసింహారావు తన కుటుంబంతో కలిసి మూడు రోజులు కిందట తమ కుమార్తె వద్దకు విజయవాడ వెళ్లారు. శనివారం రాత్రి ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులతోపాటు బీరువా తాళాలు పగలకొట్టి అందులోని రూ.10 వేల నగదు, రూ.30 వేల విలువైన వెండి వస్తువులు, రూ.20 వేల విలువైన బంగారపు పోగులు మాయమైనట్లు గుర్తించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన తపస్సుకాల ప్రార్థనా కూటములు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో తపస్సుకాల ప్రార్థనా కూటములు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫాదర్ బెన్ని విచ్చేసి క్రీస్తు శ్రమల పాటులను, శిలువ మీద యేసుక్రీస్తు పడిన మహా వేదన త్యాగాన్ని ప్రజలకు వివరించారు. శిలువపైన యేసు ప్రభువు పలికిన ఏడు మాటల అర్థం, పరమార్థాన్ని గ్రహించి ఉపవాస దీక్షలతో మన జీవితాలు సక్రమంగా నిలుపుకోవాలని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ చాట్ల మరియదాసు, సహాయక గురువు ఫాదర్ పాయమ్మ, పెనుమూలి, మంచికలపూడి, కె.ఆర్.కొండూరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తిస్తాం

తాడేపల్లిరూరల్: గ్రామీణ, పట్టణ క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించేందుకు టెన్నిస్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని కళ్లం బ్రదర్స్ అన్నారు. శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెనుమాక గ్రామంలోని జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్, క్రికెట్ టోర్నమెంట్‌ను ఈనెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కళ్లం ఫౌండేషన్ నిర్వాహకులు కళ్లం బ్రదర్స్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన వారు ఎంట్రీ ఫీజు రూ.3,333 చెల్లించి ఈనెల 7వ తేదీలోపు వివరాలను నమోదు చేసుకోవాలని, 9వ తేదీ నుంచి ఓపెన్ డ్రా ద్వారా మ్యాచ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. మొదటి విజేతగా నిలిచే జట్టుకు కళ్లం పానకాలరెడ్డి, కళ్లం రాజశేఖరరెడ్డిల సహకారంతో రూ.లక్ష, రెండో విజేతగా నిలిచే జట్టుకు కళ్లం బ్రదర్స్ సహకారంతో రూ.50 వేలు, మూడో విజేతగా నిలిచే జట్టుకు కళ్లం సుభాష్‌రెడ్డి రూ.30 వేలు, నాల్గవ విజేతగా నిలిచే జట్టుకు రూ.20 వేలు అందజేస్తామని తెలిపారు.

రైతులకు మేలు చేసేందుకే రీ సర్వే

తాడేపల్లిరూరల్: ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు, నివాసదారులకు ప్రయోజనం కలిగించేందుకు వైఎస్సార్ జగనన్న మీ భూమి మీ హక్కు పథకాన్ని ప్రవేశపెట్టి రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తహసీల్దార్ మల్లేశ్వరి అన్నారు. తుమ్మపూడి గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. తుమ్మపూడి గ్రామ చిత్రపటాన్ని చూపించి సర్వే కార్యక్రమం ఏవిధంగా నిర్వహిస్తారో వివరించారు. మండల సర్వేయర్ గోపాల్, గ్రామ సర్పంచ్ షేక్ అజీజున్, గ్రామ వీఆర్వో సుందరరావు ఉన్నారు.

భారతదేశం విజ్ఞాన శాస్త్రానికి పుట్టినిల్లు

- కేంద్ర రక్షణ మంత్రి శాస్త్ర సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి



పుస్తకావిష్కరణ చేస్తున్న డాక్టర్ సతీష్‌రెడ్డి, కేఎల్‌యూ రిజిస్ట్రార్ సుబ్బారావు తదితరులు

తాడేపల్లిరూరల్: భారత దేశం విజ్ఞాన శాస్త్రానికి పుట్టినిల్లు అని కేంద్ర రక్షణ మంత్రి శాస్త్ర సహాదారులు డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో స్వాతంత్ర్య సమరంలో విజ్ఞాన శాస్త్రం పుస్తక ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవరుచుకోవాలన్నారు. విజ్ఞాన శాస్త్ర ఆవశ్యకతను విద్యార్థులు అవగతం చేసుకోవాలని అన్నారు. ఆర్యభట్ట, చరకుడు, సుశ్రుతుడు వంటి మహా శాస్త్రవేత్తలు పూర్వకాలంలోనే భారత దేశంలో విజ్ఞాన శాస్త్రంలో పలు ఆవిష్కరణలు చేశారని గుర్తుచేశారు. మన దేశానికి స్వాతంత్ర్యం రాకముందే జగదీష్ చంద్రబోస్, సర్ సివి రామన్, ప్రఫుల్ల చంద్రరే, మహేంద్రాలాల్ వంటి వారు సమాజానికి విజ్ఞాన ఫలాలను అందించారని వివరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరంలో భారత శాస్త్రవేత్తలు పుస్తకాన్ని ఆవిష్కరించి రచయిత జయంత్ సహస్ర బుద్ధేను అభినందించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, స్కూల్ ఆఫ్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ శ్రీకొండ, విజ్ఞాన భారతి ఆంధ్రప్రదేశ్ అధ్యాపకులు డాక్టర్ పి.ఎస్.అవధాని తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన శనివారం పెదపాలెంలో ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు డాక్టర్ హబీబుల్లా ఖాన్ తెలిపారు. విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్, సర్పంచ్ పి.కృష్ణప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి, సమన్వయకర్తలు పి.సురేష్, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు. వలంటీర్లను వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు అభినందించారు.

